


# టీబీ వచ్చింది!

Nagarjuna.

విశ్వమోహిని

వంటపని పూర్తి చేసుకుని తెలుగుపత్రిక ఒకటి చేతిలోకి తీసుకున్న లలిత, కిలకిలమంటూ ఇరుగు పొరుగు వనితలు రావడంతో పుస్తకం పక్కన పడేసి చిరునవ్వుతో వారిని ఆహ్వానించింది.

అందరి చూపులూ తనమీదే సూటిగా వుండటమే కాక కొత్తగా, వింతగాకూడా వుండడంతో విస్తుపోయింది లలిత.

తనను గుచ్చిగుచ్చి చూస్తున్నట్లున్నాయి వాళ్ళ చూపులు.

ఆ చూపులు ఎందుకో ఇబ్బంది కలిగించాయి లలితకు. రోజూకాక వారి కన్నులలో సానుభూతి, వదనాలలో జాలి, పలుకుల్లో పరామర్శ తొణికిసలాడుతుంటే కారణం తెలియక తికమక పడింది.

"వంటయిపోయిందామ్మా!" అంటూ ఒకావిడ పలుకరించింది లలితను ఒరియాలో.

అయిందని చెప్పింది లలిత.

"నీ వంట్లో ఎలా వుందమ్మా!" అంటూ ప్రశ్నించింది మరొకావిడ.

లలిత ఆశ్చర్యం ఇనుమడించింది.

"బాగానే వున్నదే!" అంది.

"ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకో అమ్మా!" అంది యింకొకావిడ.

అనుకొని ఆ హెచ్చరికకు అర్థమేమిటో తెలియలేదు లలితకు. కళ్ళు వెడల్పు చేసుకుని చూసింది ఆవిడవంక.

"బలమైన తిండి తినాలమ్మా!" అంది మరొకావిడ.

"ఎందుకండీ!" అంది లలిత అమాయకంగా.

ఆ ప్రశ్నకు ఎందుకో ముఖాలు చూసుకున్నారంతా.

"అహా! నీరసంగా కనిపిస్తూంటేనూ...." అంటూ నీళ్ళు నమిలింది ఆవిడ.

ఓ గంటసేపు కూర్చుని ఆ కబురూ, యీ కబురూ చెప్పుకున్నా, ఆ రోజెందుకో వారి సంభాషణలో ఎక్కువగా వివిధ రోగాల చుట్టూ పరిభ్రమించటం గమనించిన లలిత విస్తుపోయింది.

వాళ్ళు వెళ్ళగానే మంచంమీద వెల్లకిలా పడుకొని ఆలోచనలో పడిపోయింది లలిత...

లలిత భర్త వుద్యోగరీత్యా భువనేశ్వర్ వచ్చి అయిదేళ్ళయింది. వాళ్ళు వుంటున్న వీధిలో ఒరియావాళ్ళే కాక ఒకరిద్దరు తెలుగువాళ్ళు కూడా వున్నారు. లలితకు ఒరియా చాలామటుకు అర్థమవటమే కాక, కొద్దిగా మాట్లాడగలుగుతోంది కూడాను. ఇరుగుపొరుగులతో స్నేహంగా వుంటుంది. ఎక్కడో దూరంనుంచి వచ్చామే అన్న బెంగ లేకుండాపోయింది.

అయితే ఆ రోజు ఆ వీధిలోని స్త్రీల ధోరణి బోధపడక అయోమయంగా వున్నది ఆమెకు. ఎందుకో అయాచితంగానే తన ఆరోగ్యం గురించి ఉచిత సలహాలు ఇవ్వడానికి కారణం ఏమిటో ఎంత ఆలోచించినా బోధపడలేదు.

అలా వారంరోజులుగా జరుగుతూనే వున్నది. కనిపించినవాళ్ళంతా తనవంక సానుభూతిగా చూస్తున్నట్లు అనిపించసాగింది.

ఇక వుండబట్టలేక ఆ రోజు భర్త ఆఫీసునుంచిరాగానే తన మదిలోని అలజడి అతనికి చెప్పుకోవాలనుకుంది.

సాయంత్రం ఇంటికి వచ్చిన లలిత భర్త రామారావు ప్రవర్తనలో కూడా ఏదో మార్పు గమనించింది. అంతవరకూ తన పనేదో తానుగా వుంటూ ఇంటి పనులలో భార్యకు పిసరంత సాయం కూడా చేయడం అలవాటులేని అతను, భార్యను 'బరువులు ఎత్తకు... పని పెంచుకొని అలసిపోకు... ఈ పని నేను చేసిపెడతాను గాని నువ్వు కాసేపు విశ్రాంతి తీసుకో' అంటూ పనులలో సాయం రావడం ఆరంభించాడు.


లలిత విస్తుపోయింది. ఆ విధంగా ప్రతిపనిలోనూ అడ్డుతగలడం ఆమెకు విసుగుకూడా కలిగించింది.

రెండు మూడు రోజులుగా 'డాక్టర్ దగ్గరకు వెళదామా లల్లీ!' అంటూ పతాయించడంతో తికమకపడిందామె.

'ఎందుకు?" అని అడిగితే. 'అబ్బే, ఈ మధ్య నీకు పని ఎక్కువయి అలసటగా కనిపిస్తున్నావుగా, జనరల్ చెకప్ కోసమని' అని జవాబిచ్చాడు.

ఆ మాట అతను క్యాజువల్‌గా అన్నట్లున్నా అందులో ఏదో తిరకాసు వున్నదనిపించింది ఆమెకు.

అటు బయట ఇరుగుపొరుగు స్త్రీల ప్రవర్తన, ఇటు ఇంట భర్త ధోరణి చూస్తూంటే లలితకు పిచ్చెక్కసాగింది. అంతా తన ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తంచేస్తూ, పరోక్షంగా సలహాలు




ఇచ్చేవారే తప్ప సూటిగా విషయమేమిటో ప్రస్తావించేవాళ్ళు ఒక్కరూ లేరాయె.

నాలుగురోజుల తరువాత చెప్పాచెయకుండా హఠాత్తుగా వూడిపడ్డ తండ్రిని చూడడంతో ఆశ్చర్యమూ, ఆనందమూ కూడా కలిగాయి లలితకు. అడిగితే వాళ్ళో అంతా బాగానే వున్నారన్నాడు.

తండ్రీ, భర్తా గుసగుసగా ఏదో విషయాన్ని గూర్చి సీరియస్‌గా డిస్కస్ చేయడం వంటపనిలో వున్న లలిత గమనిస్తూనే వుంది. తాను వెళ్ళినప్పుడల్లా వాళ్ళు మాట మార్చేస్తున్నట్లు అనుమానం పొడసూపింది ఆమెకు. ఏమయివుంటుందా అని ఆలోచిస్తూనే వుంది పని చేస్తూన్నంత సేపు.

అల్లుడు ఆఫీసుకు వెళ్ళాక కూతురితో కబుర్లకు దిగాడు తండ్రి. మాటల మధ్యలో హఠాత్తుగా, "నీ వంట్లో అనారోగ్యంగావుంటే డాక్టర్‌కి చూపించుకోకూడదటమ్మా!" అన్నారాయన మందలింపుగా.

లలిత విస్తుపోయి, "నాకు అనారోగ్యమని ఎవరు చెప్పారు నాన్నా?" అంది.

కొద్దిగా తడబడ్డాడతను.

"అబ్బే! అలసటగా కనిపిస్తున్నావని అల్లుడి ఆరాటం అనుకుంటామ?" అన్నాడు.

ఆ వ్యవహారమేమిటో తేల్చుకోవటానికి అదే తగిన సమయం అనుకుందామె. తండ్రిని నిలవేసింది... "అసలు నా ఆరోగ్యం గురించి ఇంత హఠాత్తుగా బెంగ ఎందుకు పట్టుకున్నదట? ఈమధ్య ఆయన ధోరణి వింతగా వుంది. ఉదయం మీరిద్దరూ మాట్లాడుకుంటున్నారు, ఏమిటది?" అంటూ.

చిన్నగా నిట్టూర్చి ఇలా అన్నాడతను.

"నిజమేనమ్మా! ఈమధ్య నీ ఆరోగ్యం దెబ్బతిన్నదనీ, వైద్యానికి వొప్పుకోవడంలేదనీ కంగారుపడుతూ అల్లుడు టెలిగ్రాం ఇచ్చాడు నాకు, వెంటనే బయలుదేరమని. అది చూసి మీ అమ్మ ఏడుస్తూ కూర్చుంటే అసలు సంగ

తేమిటో చూసి వస్తానని చెప్పి తక్షణం బయలుదేరి వచ్చాను..."

లలిత నిర్ఘాంతపోయింది.

"ఇదేదో వింతగా వుంది నాన్నా! నేను గుండ్రాయిలా వుంటే నాకు జబ్బే మిటి? ఆయన మీకు టెలిగ్రాం ఇవ్వడ మేమిటి? అంతా అయోమయంగా వుంది నాకు" అంది.

"చూపులకు నువ్వు బాగా కనిపిస్తున్న మాట నిజమేనమ్మా! కాని, ఆ వ్యాధి వున్నదే ప్రారంభంలో పైకి తెలియదు. నిర్లక్ష్యంచేస్తే ప్రమాదం!" అన్నాడతను

"ఇందులో ఏదో తిరకాసు వుంది నాన్నా! అసలు ఆయన నీతో ఏం చెప్పారో చెప్పు?" అని కూతురు నిల వేయటంతో చెప్పక తప్పలేదు అతనికి.

"నువ్వు టీబీతో బాధపడుతున్నావని ఆ మధ్య అల్లుడు కొలీగ్ ఎవరో ఆఫీ సులో చెప్పాడట..."

టి.బి అనగానే వులిక్కిపడింది లలిత.

"నాకా!!" అంది అప్రయత్నంగా.

"ఊఁ. నీకు ట్రీట్‌మెంట్ ఇప్పించ కుండా నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ మెత్త మెత్తగా చివాట్లుకూడా పెట్టాడట."

శిలాప్రతిమే అయింది లలిత.

"చక్కగా తిని తిరుగుతున్నదాన్ని నాకు టి.బీ ఏమిటి? ఇందులో ఏదో మిస్టరీ వుంది!" అందామె.

సాయంత్రం భర్త ఆఫీసునుంచి రాగానే నిలవేసింది లలిత, తన అనా రోగ్యం గురించి అతనితో చెప్పిందెవ రంటూ.

"ఈశ్వరరావు చెప్పాడు. వాళ్ళావిడ అతనితో చెప్పిందట," అన్నాడు రామా రావు. "వీధంతా తెలిసినా నీకు తెలీ దంటావేమిటి? మరీ అంత బాధ్యతా రహితంగా వుండకూడదు!" అంటూ నాకు చీవాట్లువేసాడు.'

"ఈ మధ్య వీధిలోని ఆడా, మగా అంతా నావంక వింతగా చూడ్డానికీ, వారి విచిత్రధోరణికి కారణం ఇదన్నమాట!" అంది లలిత ఎనలేని ఆశ్చర్యంతో. "అసలు ఈశ్వరరావుగారి భార్య జానకిని అడిగితే తెలవ్వొచ్చు. ఆవిడతో ఎవరు చెప్పారో?"

"ఎందుకులెద్దూ లేనిపోని గొడవలు- ఓసారి డాక్టర్‌కి చూపించుకుంటే సందేహనివృత్తి అయిపోతుంది గదా!" అన్న భర్తవంక వురిమిచూసింది లలిత.

"నాకేంలేదని చెబుతుంటే మీక్కాదూ! నాకు టీబీలేదు గీబీలేదు అంటే విన కుండా, ఎవరో ఏదో వాగారని డాక్టర్లో అంటూ నా ప్రాణం తీస్తారేమిటి?" అంటూ విసుక్కుంది.

"ఉండండి ఆ జానకిని అడుగుతాను, ఇలాంటి తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తోందో!" అని కూడా అంది.

"నిజంగానే నీకేమీ లేకపోతే వూరుకోగాని, అనవసరపు గొడవలు ఎందుకులేమ్మా!" అన్నాడు తండ్రి.



అయినా లలిత మనసు వూరుకోలేదు.

మర్నాడు మగవాళ్ళంతా ఆఫీసులకు వెళ్ళిపోగానే జానకి ఇంటికి వెళ్ళింది లలిత.

"నాకు టీబీ వుందని మీతో ఎవరు చెప్పారు?" అంటూ జానకిని సూటిగా అడిగింది.

మొదట తడబడ్డా చివరకు చెప్పక తప్పలేదు జానకికి.

"పదిరోజుల క్రితం ఇంటివాళ్ళమ్మాయి సవిత అన్నది నాతో, 'లలిత ఆంటీకి టీబీ వచ్చిందని'... మనసు వుండబట్టలేక మా వారితో చెప్పాను. మీ వారితో చెప్పి అశ్రద్ధ చేయకుండా ట్రీట్‌మెంట్ ఇప్పించమని... చెప్పమని" అందామె.

'నోరు వుండబట్టలేక వీధంతా చాటి వుంటావు!' అనుకుంది లలిత మనసులో, జానకి సంగతి తెలిసినందున.

ఇల్లుగలవాళ్ళమ్మాయి సవితకు పదేళ్ళుంటాయి. అందంగా, బొమ్మలా వుంటుంది. స్కూలునుంచి రాగానే లలిత దగ్గరకొచ్చి కబుర్లు చెబుతూ వుంటుంది.

సరదాగా వుండే ఆ పిల్ల జానకితో అలా ఎందుకు చెప్పిందా అనుకుని విస్తు పోయింది లలిత.

ఆరోజు సాయంత్రం సవిత వచ్చే సరికి రామారావు, లలితతండ్రి ఇంటి వద్దే వున్నారు.

"సవితా! నేనో విషయం అడుగు తాను, నిజం చెబుతావు కదూ!" అంది లలిత ఆ పిల్లచేతిలో స్వీటు పెట్టి.

"ఓ!" అంది ఆ పిల్ల.

"నాకు టీబీ వచ్చిందని జానకి అంటీతో చెప్పావట నిజమేనా?"

"నిజమే ఆంటీ!"

"అలా ఎందుకు చెప్పావ్?" లలిత గొంతులోని కరుకుతనానికి తెల్ల బోయింది ఆ పిల్ల.

"చెప్పటం తప్పా ఆంటీ?" అంది బిక్కమొగం వేసి.

"అబద్ధం చెప్పడం తప్పు కదూ?"

"ఇందులో అబద్ధం ఏముంది? నీకు టీబీ రావడం నిజమేగా!" అంది సవిత.

ఆ పిల్ల సమాధానానికి నోళ్ళు మండి పోయిన లలిత "నీకు తెలుసా?" అంటూ దాదాపు అరిచింది.

సవిత అయోమయంగా చూస్తూ, "అదేమిటి?" అంటూ హాల్లో చూపిం చింది.

ఈసారి తెల్లబోవడం లలిత వంతయింది.

"ఏమిటి నువ్వంటున్నది?" అని అడిగింది.

"అదిగో, కోనార్క్ టీబీ!" అంటూ హాల్లో వున్న టీవీసెట్‌ని చూపించింది సవిత.

వారి సంభాషణను కుతూహలంతో ఆలకిస్తున్న రామారావు లలితతండ్రి చిత్రప్రతిమలే అయ్యారు.

తేరుకునేసరికి అసలు విషయం అర్థమయింది లలిత, రామారావులకు.

అంతే! పొట్టచెక్కలయ్యేలా నవ్వడం ఆరంభించారు ఇద్దరూ.

సవిత బిత్తరపోయి చూసింది.

లలిత తండ్రి అయోమయంలో పడి పోయారు.

"ఎందుకర్రా అలా నవ్వుతారు!" అన్నాడు తనకూ నవ్వొస్తూంటే.

"అసలు విషయం అర్థమైపోయింది నాన్నా! తప్పు ఈ పిల్లది కాదు- వీళ్ళ భాషది-" అంది లలిత నవ్వాపుకుంటూ.

"ఒరియా భాషలో 'వ'కు బదులు 'బ' పలకడం అలవాటు. ఉదాహరణకు 'భువనేశ్వర్'ని 'భుబనేశ్వర్' అంటారు. అందుకే మనకు టీవీసెట్ రాగానే ఈ పిల్ల జానకి దగ్గరకెళ్ళి 'లలిత ఆంటీకి టీబీ వచ్చింది' అంది. ఒరియా సరిగా రాని జానకి నాకు టీబీ వచ్చిందనుకుని కంగారుపడిపోయి వీధంతా చాటేసింది. అదే ఇంతవరకు దారితీసింది..."

కూతురు వివరించడంతో పొంగి వచ్చే నవ్వుతో పొట్టపట్టుకోవడం ఈసారి తండ్రివంతయింది. **